అలు పెరగరు..

• జీవన పయనంలో అలసిపోని కష్టజీవులు • ఎవరిపైనా ఆధార పడకుండా కుటుంబాలను పోషించుకుంటున్న వృద్ధులు

జీవితం ఎవరికీ పూల పాన్పు కాదు. మనిషి ఎలా బతకాలో పాఠం నేర్పుతుంది. ఎందరికో దిక్సూచిగా నిలుస్తుంది. కొందరికి ఉపాధి కల్పిస్తే.. మరికొందరికి కష్టం విలువను తెలియజేస్తుంది. జీవితం నేర్పే పాఠానికి పెద్ద చదువులు అవసరం లేదు. పెద్దగా ఆస్తులు.. అంతస్తులతో పనిలేదు. కష్టపడితే వచ్చే ప్రతిఫలమే వేరు. దానిలోనే ఆనందం.. శ్రమ.. సంపాదన.. తృప్తి దాగి ఉన్నాయి. కొందరు వృద్ధాప్యం **వచ్చినా సరే అలసిపోకుండా జీవన పయనంలో ముందుకు సాగిపోతున్నారు. అందుకు నిదర్శనంగా నియోజకవర్గంలో ఎందరో జీవిస్తున్నారు. కుటుంబ పోషణ, పొట్టకూటి కోసం** ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వారికి నచ్చిన పనులు చేసుకుంటూ జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. వారిలో కొందరు కష్టజీవులు తమ జీవనగాథలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– డాబాగార్డెన్స్

చిరు వ్యాపారంతో కుటుంబానికి సాయం



వెలంపేటకు చెందిన ఈ పెద్దాయన పేరు సూరిబాబు. 60 ఏళ్లకు పైగా వయసు. కుమారులు, కుమార్తెలపై ఆధారపడలేదు. దారపు రీల్స్, రిబ్బన్స్, బొట్టుల ప్యాకెట్లు విక్రయిస్తూ కుటుంబ పోషణలో భాగస్వాముడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటిని విక్రయిస్తూ కుటుంబం కోసం తను సంపాదించుకోవడమే గాక.. పిల్లలు, మనవలకు కాస్తా సాయమందిస్తున్నాడు. భర్త కష్టపడుతున్న దానిలో భార్య కూడా భాగస్వామిగా నిలుస్తోంది. వీరిద్దరి సంపాదన రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు ఉంటోంది. ఇంటి అద్దె రూ.5 వేలు పోగా మిగిలినది వారి ఖర్చులకు సరిపోతోంది.

పోర్టులో 'టీ' విక్రయాలే జీవనాధారం

విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ పరిధి(పోర్టు పరిసర ప్రాంతమంతా.. అన్ని విభాగాలు)లో సుమారు 40 ఏళ్లుగా 45 మంది చాయ్ విక్రయిస్తూ జీవిస్తున్నారు. వీరంతా వేకువజాము 4 గంటలకే పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 10 గంటల వరకు 6 నుంచి 10 ఫ్లాస్క్‌ల్లో టీ విక్రయిస్తుంటారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు టీ అమ్ముతుంటారు. వీరంతా సీపోర్టు, ఎస్సార్ పాయింట్, బొగ్గు జెట్టీ, ఎల్-15 బెర్త్, శ్రీనివాస కాటా, నార్త్ గేట్, ప్రధాన గేట్, ఎస్-4, కాన్వెంట్ ఏరియా.. ఇలా పోర్టు పరిధిలోని అన్ని విభాగాలను టచ్ చేసుకుంటూ టీ విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.





ఆటో తోడుగా ఒంటరి జీవితం

పాతనగరం కన్వేయర్ బెల్ట్ ప్రాంతానికి చెందిన దేముడు ఆటో నడుపుతుంటాడు. తన పిల్లలకు పెళ్లి చేశాడు. శేషజీవితంలో తోడు నీడగా ఉంటాదనుకున్న అతడి భార్య పదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి ఆటో నడుపుతూ ఒంటరిగానే తన జీవితాన్ని సాగిస్తున్నాడు. కాళ్లు, చేతులు పనిచేసినంత వరకూ మనిషి కష్టాపడాలన్నది ఈయన ఉద్దేశం.



తోపుడు బండితోనే 40 ఏళ్లుగా..

పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన నెల్లూరు(నేస్తా నమ్మ అమ్మవారి పేరు) 40 ఏళ్లుగా తోపుడు బండినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. పిల్లలకు పెళ్లిళ్లు చేశాడు. భార్యతోనే స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఒక రోజు ఎంతో కొంత వస్తే.. భేరాల్లేక పస్తులున్న రోజులున్నాయి. పిల్లలపై ఆధారపడలేదు. ఒకరి వద్ద చేయి చాపకుండా కష్టాన్నే నమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

50 ఏళ్లుగా రిక్షాను నమ్ముకుని..

పాతనగరం రాజప్పనాయుడు వీధి ప్రాంతానికి చెందిన బండి అప్పారావు 50 ఏళ్లుగా రిక్షానే నమ్ముకుని జీవిస్తున్నాడు. పిల్లలకు పెళ్లి చేశాడు. శేష జీవితంలో హాయిగా మనుమలు.. మనమరాండ్రలతో గడపాల్సిన ఈ పెద్దాయనకు ఏడు పదుల వయసు దాటింది. పిల్లలపై ఆధారపడలేదు. స్కూల్ పిల్లలను తీసుకెళ్తూ తన శేష జీవితాన్ని హాయిగా గడుపుతున్నారు.



క్లుప్తంగా

కుమార్తెకు తండ్రి అప్పగింత



శ్రీనివాస్‌తో కుమార్తె లక్ష్మి, పోలీసులు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తలపెట్టిన మిషన్ తమసోమా జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా ఇప్పిలి శ్రీనివాస్(60)కు భీమ్‌నగర్ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. హనుమంతువాకలో నివసించే ఆయన రోడ్డుపై కనిపించడంతో ఆరిలోవ పోలీసులు ఆశ్రయమిచ్చారు. ఇంతలో తండ్రి కనిపించడం లేదని అతని కుమార్తె వెతుకుతూ... ఏయూటీడీ జీవీఎంసీ భీమ్‌నగర్ షెల్టర్‌లో ఉంటున్నాడని తెలుసుకుంది. అక్కడకు చేరుకున్న ఆమెకు తండ్రి ఇప్పిలి శ్రీనివాస్‌ను టూటౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.కన్నారావు, ఏఎస్ఐ పి.కాంతమ్మ ఆధ్వర్యంలో సోమవారం అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. భిక్షాటనకు పంపవద్దని కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

5కే రన్ విజేతలకు బహుమతులు



విజేతలతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: 5కే రన్‌లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను జిల్లా అధికారులు అందించారు. విజేతలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలను త్వరలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ ఖర్చులతో పంపుతామని తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందచేశారు.

మహిళల బస్‌పాస్ కౌంటర్ ఖాళీ



మహిళల కౌంటర్‌లో బస్‌పాస్ తీసుకుంటున్న పురుషులు

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ద్వారకా బస్ స్టేషన్‌లో ఉన్న మహిళల బస్‌పాస్ కౌంటర్ ఖాళీగా దర్శనమిస్తోంది. చేసేదేమీ లేకపోవడంతో మహిళల కౌంటర్లలో పురుషులకు బస్‌పాస్‌లను రెన్యువల్ చేస్తున్నారు. ఒకప్పుడు కిటకిటలాడే లేడీస్ కౌంటర్లు ప్రస్తుతం ఇలా దర్శనమిస్తున్నాయి.

ఏవీఎన్ పాఠశాల విద్యార్థులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఆర్డినో ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ కె.వి జయ్‌కుమార్ ఐకాన్ కంప్యూటర్‌లో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ, కార్యదర్శి భాస్కర్ జగన్, ఏవీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎంవీ భానుమతి, వీ డెంటల్ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచాలి



అక్షరాస్యత దినోత్సవంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు తదితరులు

దాబాగార్డెన్స్: డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించే థీమ్‌తో యునెస్కో సోమవారం ఫ్రాన్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు నేతృత్వంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. అక్షరాస్యతను పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉప పాలకురాలు జి.తిరుమలకుమారి, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రజలందరికీ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సెమినార్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, పలు విభాగాల అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ధర్నా



జోన్-5 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కంచరపాలెం: ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికుల పెండింగ్ జీతాలను మంజూరు చేయడం లేదన్నారు. జోన్-5 పరిధి కార్మికులకు ప్రతి నెలా జీతాలు పడటం లేదని చెప్పారు. చనిపోయిన, రిటైర్డ్, సిక్ కార్మికుల పిల్లలకు ఆప్కాస్ ద్వారా తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేసిన కార్మికులు, సీఐటీయూ నాయకులు జోనల్ కమిషనర్ రామును కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రావణ్, కుమార్, వి.మహేశ్వరి, కన్నతల్లి, బాలరాజు, పాపారావు, రమణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ



బస్సులో పోగొట్టుకున్న డబ్బును ప్రయాణికుడికి అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

దాబాగార్డెన్స్: ఆర్టీసీ సిబ్బంది నిజాయితీతో బస్సులో దొరికిన డబ్బును.. పోగొట్టుకున్న ప్రయాణికుడికి అందజేశారు. వివరాలిలా.. అనకాపల్లికి చెందిన జి.రామకృష్ణ విశాఖపట్నం నుంచి అనకాపల్లి వెళ్లేందుకు సోమవారం ఉదయం ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 500 రూట్ నంబర్ బస్సు (ఏపీ39టీయూఎల్ 3567) ఎక్కాడు. ఆ బస్సు రద్దీగా ఉండటంతో వేరే బస్సు ఎక్కేందుకు కిందకు దిగాడు. ఈ క్రమంలో అతడు రూ.2 వేలు పోగొట్టుకున్నాడు. రద్దీగా ఉన్న బస్సులో రామకృష్ణ పోగొట్టుకున్న డబ్బు ఆ బస్ కండక్టర్‌కు దొరికింది. ఆ నగదును గ్రౌండ్ బుకింగ్ కండక్టర్ జి.సంతోష్‌కు అందజేశారు. ఈ విషయాన్ని స్టేషన్ మేనేజర్ జి.వి.రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని వివరాలు తెలుసుకుని పోగొట్టుకున్న డబ్బును రామకృష్ణకు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.గంగాధర్ అందజేసి, సిబ్బందిని అభినందించారు.

జోన్-5కు రెండే వినతులు



జోన్-5 కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అందిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను ఆదుకోండి మహాప్రభో..



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

దాబాగార్డెన్స్: గత 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టర్లు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంఎస్ఎంఈ నేషనల్ బోర్డు సభ్యుడు విష్ణుకుమార్‌రాజును, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ టి. శివశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.420 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, దసరా పండుగ వస్తుండటంతో కూలీలకు డబ్బులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 6 నెలలకే బిల్లులు చెల్లించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా బిల్లులు చెల్లించలేదని వారు వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కనీసం 6 నెలల బిల్లులు అయినా చెల్లించాలని కోరారు. ఎంఎస్ఎంఈ ద్వారా టీఆర్ఈడీఎస్ ప్లాట్‌ఫాం ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సంజీవరెడ్డి, జి.సింహాచలం, మద్దాల రమేష్, సిరికి శ్రీనివాసరావు, షేక్ సిలార్ పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514 నంబర్లను సంప్రదించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ కోడ్ – యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా మెయిల్ ఐడీ endow&eokanaka@gov.inకి వివరాలు పంపించవచ్చు.


పాలస్తీనియన్ల హత్యలు వెంటనే ఆపాలి



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

అల్లిపురం: ప్రపంచ వ్యాప్తంగా.. ముఖ్యంగా యూరోపియన్ దేశాల్లో లక్షలాది మంది ప్రజలు, పాలస్తీనియన్ల సామూహిక హత్యలను ఆపాలని ఇజ్రాయేల్‌ను డిమాండ్ చేస్తూ బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సోమవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్, ప్రపంచ వ్యాప్తంగా భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన మేరకు నిరసనకారులు గాజా, వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్ల హత్యలను ఇజ్రాయేల్ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

వైద్య సేవల కోసం ప్రత్యేక వాహనం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: చిన్నపిల్లల్లో వైకల్యం తగ్గించడానికి, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక వాహనం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. చికిత్సలకు పూర్తి ఉచితంగా తీసుకెళ్లడానికి వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వాహనాన్ని సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అన్ని పథకాలకు ఈ వాహనం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ హారిక, జిల్లా మీడియా విస్తరణాధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.అప్పారావు, మేనేజర్ శాంతిప్రియ, వైద్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద అతిగా ప్రవర్తించిన పోలీస్ అధికారి



కలెక్టరేట్ వద్ద ఆందోళనకారులను బెదిరిస్తున్న పోలీస్ అధికారి

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేసిన వారితో పోలీసులు అతిగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. సమస్యల సాధన కోసం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాలు, ఆందోళనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు, కార్యకర్తలు, జనం పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న వారిని ఉద్దేశించి పోలీస్ అధికారి ఒకరు ప్రవర్తించిన తీరుపై ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. సమస్యల సాధన కోసం ఆందోళన చేస్తున్న వారిని బెదరించడం తగదని, తక్షణం ఈ అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు



అంబికాబాగ్ రామాలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది, సేవకులు

దాబాగార్డెన్స్: చంద్రగ్రహణం కారణంగా ఆది వారం మధ్యాహ్నం నుంచి మూతపడిన ఆలయాలు సోమవారం ఉదయం తెరుచుకున్నాయి. ఆలయాలను శుద్ధి చేసి... సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కనకమహాలక్ష్మి దేవాలయంలో సోమవారం ఉదయం 5 గంటలకు ప్రాత:కాల సమయంలో శుద్ధి, సంప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపారు. 7 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయం, వెలంపేట దుర్గాలమ్మ ఆలయం, మెయిన్‌రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం, శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం, చెంగల్రావుపేటలో ఉన్న కోదండ రామాలయం, కంచరవీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాలు, అమ్మవారి దేవాలయాల్లో సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

కూటమి పాలనలో ప్రజా సంక్షేమానికి పాతర



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాల్లో ఆరితేరారని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో సోమవారం జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చంద్రబాబు మోసపూరిత హామీలు, కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటా ప్రచారం చేసి, కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు పాతర వేశారని విమర్శించారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు కంటే అదనంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించామని గుర్తు చేశారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలనే చైతన్యాన్ని ప్రజల్లో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేశంగిరిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, కిషోర్, పరశురామ్, శ్రీను, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు



వ్యాస రచన పోటీ విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, తదితరులు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నేత్ర దాన ఆవశ్యకత, వాటిపై ఉన్న అపోహలు తొలగేలా 15 రోజుల పాటు నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వద్ద కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించినట్టు డాక్టర్ మీనాక్షి తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జ్యోతిర్మయి, నవీన్‌కుమార్, శ్రీలక్ష్మి, ఐ బ్యాంక్ మేనేజర్ అభినీత్, నేత్ర వైద్యశాల సిబ్బంది, ఏఎంసీ విద్యార్థులు, మొహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుదారులకు సమాచారమివ్వాలి

మహారాణిపేట: సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరుడు కోరిన ప్రతి సమాచారం ఇవ్వాల్సి ఉన్నా.. కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గ సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు షేక్ బాబ్జి ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం ద్వారా సమాచారాన్ని పొందే హక్కు ఉందన్నారు. దానిని కొంత మంది అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ప్రజా హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పౌరులకు సంతృప్తికరమైన సమాచారాన్ని సంబంధిత అధికారుల ద్వారా ఇప్పించాలని కోరారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి తిలారు–ఉర్లాం–శ్రీకాకుళం– దూసి–పొందూరు లైన్ల పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నం–బ్రహ్మపూర్ (58532) పాసింజర్, ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మపూర్–విశాఖపట్నం (58531) పాసింజర్‌లు రద్దు చేశారు.

• ముంబయి డివిజన్, కళ్యాణ్– లోనావాలా సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 10వ తేదీన పూణే వరకు మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ తొలగింపు

అక్టోబరు 10, 11 తేదీల్లో బయల్దేరే భువనేశ్వర్ న్యూ–ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు కర్జత్ స్టేషన్‌లో హాల్ట్‌ను తొలగించారు.